ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బడులు బోసిపోతున్నాయ్..!



హెచ్‌జీ పాఠశాలలో 62 మందికి గాను 30 మంది మాత్రమే హాజరైన 4వ తరగతి విద్యార్థులు

- వలస బాటలో విద్యార్థులు
- తల్లిదండ్రులతో కలిసి పట్టణానికి పయనం
- కర్నూలు పశ్చిమ ప్రాంత పాఠశాలల్లో తగ్గిన హాజరు శాతం
- ఇలాగైతే అక్షరాస్యత మెరుగుపడేనా?

రాయలసీమ ముఖద్వారమైన కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంతం కరువుతో నేటికీ విలవిలలాడుతోంది. ఆరుగాలం కష్టపడే అన్నదాతలు నిత్యం ప్రకృతి వైపరీత్యాలతో అల్లాడిపోతున్నారు. బతుకుదెరువు కోసం బండెడు దుఃఖాన్ని దిగమింగుకొని వలసబాట పడుతున్నారు. పిల్లాపాపలతో కలిసి పని కోసం పట్టణాలకు పయనమవుతున్నారు. పలకా బలపం పట్టి బడుల్లో ఉండాల్సిన చిన్నారులు పత్తి పొలాల్లో, మిరప తోటల్లో మగ్గిపోతున్నారు. జీవితం అంటే ఏమిటో తెలియని వయస్సులో పనులు చూస్తూ.. చదువుకు దూరమై.. బతుకు భారమై.. జీవన పోరాటం సాగిస్తున్నారు. కోసిగి మండలంలో అంటే నిరక్షరాస్యతలో ముందుండేది. అలాంటి చోటకు ప్రభుత్వం కొత్త పంతుళ్లను నియమించింది. అక్షరాస్యతను పెంచేందుకు కృషి చేసింది. అయినా లాభం లేకుండా పోయింది. విద్యార్థులు సుగ్గిబాట పట్టడంతో సర్కారు స్కూళ్లు బోసిపోతున్నాయి.



హెచ్‌జీ ప్రాథమిక పాఠశాలలో 102 మందికి గాను 28 మంది హాజరైన 3వ తరగతి విద్యార్థులు

కోసిగి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వలసలు ఎంత దారుణంగా ఉన్నాయో ప్రభుత్వ బడులను చూస్తే అర్థమవుతుంది. మండ లంలోని 6,200 మంది పైగా విద్యార్థులు తల్లి దండ్రులతో కలిసి వలసబాట పట్టారంటే పరిస్థి తులు ఎంత దయనీయంగా ఉన్నాయో తెలుస్తుంది. ప్రాథమిక పాఠశాలలు 33, జిల్లా పరిషత్ పాఠశాలలు 15, మొత్తం 48 ప్రభుత్వ పాఠశాలల కు గానూ 16,175 మంది విద్యార్థులు చదువుతు న్నారు. ఇటీవలే 'ఆంధ్రజ్యోతి' ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించగా 48 పాఠశాలల్లో 9,780 మంది విద్యార్థులు హాజరయ్యారు. 6,395 మంది విద్యా ర్థులు తల్లిదండ్రుల వెంటే ఇతర ప్రాంతాలకు వెళ్లి పోయారు. అక్షరాస్యతలో దేశంలోనే చిట్టచివరి నుంచి రెండో స్థానంలో ఉన్న కోసిగిలో ఈ వలసల వల్ల అక్షరాస్యత మండలంలో పూర్తిగా హాజరు శాతం పడిపోతోంది.

కొత్త ఉపాధ్యాయులు వచ్చినా..

కోసిగి మండలానికి డీఎస్సీ ద్వారా 256మంది ఉపాధ్యాయులను ప్రభుత్వం నియమించింది. వివిధ బడుల్లో వారు విధుల్లో చేరారు. కొత్త టీచర్లతో ప్రభుత్వ పాఠశా లలు కళకళలాడాయి. కొత్త ఉపాధ్యాయులు వచ్చారు గానీ, విద్యార్థులు తల్లిదండ్రులతో పాటు వలస వెళ్లడంతో తరగతి గదులు బోసిపోతున్నాయి.



తల్లిదండ్రులు వలస వెళ్లడంతో అవ్వాతాతలతో ఉంటూ చదువుకుంటున్న అక్కాచెల్లెళ్లు అఖిలేశ్వరి, మైత్రి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల వలసలపై జిల్లా అధికారులకు తెలియజేశాం. ముందే సీజనల్ హాస్టల్స్ వచ్చి ఉంటే కొంత మేర విద్యార్థుల వలసలు తగ్గేవి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

● బాలయ్య, ఎంఈవో, కోసిగి



హెచ్‌జీ పాఠశాలలో 99 మంది విద్యార్థులకు గానూ 30 మంది హాజరైన 5వ తరగతి విద్యార్థులు

వలసలను నివారించేందుకు కృషి చేయాలి

పశ్చిమ ప్రాంతం అంటేనే గుర్తు వచ్చేవి వలసలు. ఇప్పటికే ఆయా మండలాల నుంచి వేలాది మంది వలసబాట పట్టారు. వలసలను నివారించేందుకు జిల్లా అధికారులు దృష్టి పెట్టాల్సి అవసరం ఉంది. ముఖ్యంగా కోసిగి మండలంపై ప్రత్యేక దృష్టి సారించి వలసలను నివారించి చిన్నారులు బడిబాట పట్టేలా ప్రయత్నించాల్సి ఉంది. విద్యార్థులందరూ బడికి వెళ్లితే అక్షరాస్యత కూడా మెరుగు పడుతుందని పలువురు పేర్కొంటున్నారు. సీజనల్ హాస్టల్స్ ఏర్పాటు చేసి ప్రభుత్వమే నిర్వహించేలా చూడాలని కోరుతున్నారు.

తప్పనిసరి పరిస్థితుల్లో..

బతుకుదెరువు వలస వెళ్తా పెద్దలు.. తమ పిల్లలు ఇక్కడ ఉంటే పట్టించుకునే వారు ఉండరని, తప్పనిసరి పరిస్థితుల్లో తీసుకెళ్తున్నామని చెబుతున్నారు. ఒకవేళ ఇక్కడే సరైన వసతి ఏర్పాట్లు విద్యార్థులు కల్పిస్తే పిల్లలను అక్కడి చేర్పించి తాము వలస వెళ్తాం. ఆ సౌకర్యాలు లేక గత్యంతరం లేని పరిస్థితుల్లో వెంట తీసుకెళ్తున్నామని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

గుండె చలించిపోతుంది



టీచర్లుగా నియామకమై పాఠశాలకు వచ్చినప్పుడు తరగతి గదుల నిండా విద్యార్థులు ఉండేవారు. వారం రోజుల వ్యవధిలో 60శాతం పైగా విద్యార్థులు వలస వెళ్లారు. తరగతి గదులు చూస్తే గుండె చలించిపోతుంది.

● అరివిలి అయ్యప్ప, హెచ్‌జీ పాఠశాల, కోసిగి

త్వరగా పరిష్కరించండి

- ప్రజా సమస్యలపై అధికారులకు మంత్రి బీసీ ఆదేశం
- క్యాంపు కార్యాలయంలో వినతుల స్వీకరణ



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను అధికారులు జాగ్రత్తగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని రోడ్లు భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం బనగానపల్లె పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల, టీడీపీ నాయకుల, కార్యకర్తల, వివిధ వర్గాలకు చెందిన అర్జీలను మంత్రి బీసీ స్వీకరించారు. న్యాయబద్ధంగా ఉన్న సమస్యలను అప్పటికప్పుడే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించారు. ఎక్కువగా రెవిన్యూ సమస్యలు, పింఛన్లు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వంటి సమస్యలు ఆయన దృష్టికి రాగా ఆ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

సత్ప్రవర్తనతో మెలగాలి : ఎస్పీ

నంద్యాల టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లు మంచి ప్రవర్తన అలవర్చుకోవాలని ఎస్పీ సునీల్ షెరాన్ సూచించారు. ఆదివారం నంద్యాల జిల్లా వ్యాప్తంగా పోలీసు స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లకు నేరచరిత్ర కల్గిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేర ప్రవృత్తికి స్వస్తి పలికి మంచి పౌరులుగా సమాజంలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు సుధాకర్‌రెడ్డి, అస్రర్‌బాషా, కంబగిరి రాముడు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైలానికి తగ్గిన వరద

శ్రీశైలం నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. ఆదివారం జూరాల ప్రాజెక్టు విద్యుదుత్పత్తి ద్వారా 6,480 క్యూసెక్కులు, సుంకేశుల ద్వారా 17,784 క్యూసెక్కులు, హంద్రీ ద్వారా 250 క్యూసెక్కుల నీరు విడుదల కాగా సాయంత్రానికి శ్రీశైల జలాశయానికి 41,673 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరినట్లు అధికారులు తెలిపారు. కుడిగట్టు విద్యుదుత్పత్తి కేంద్రం ద్వారా 26,866 క్యూసెక్కులు, ఎడమగట్టు విద్యుదుత్పత్తి ద్వార 35,315, మొత్తంగా 62181 క్యూసెక్కుల నీరు నాగార్జునసాగర్‌కు విడుదలైంది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులకు గాను 884.10 అడుగులు, పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 215.80 టీఎంసీలకుగాను 210.51 టీఎంసీలుగా నమోదైంది.

డెయిరీ ఎన్నికలు రద్దు చేయాలి

బోయలకుంట్ల పాల సేకరణ కేంద్రం డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

నంద్యాల రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నంద్యాల విజయ పాల డెయిరీలో త్వరలో నిర్వహించబోయే చైర్మన్, డైరెక్టర్‌ల ఎన్నికలను రద్దు చేయాలని బోయలకుంట్ల పాలసేకరణ కేంద్ర డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి డిమాండు చేశారు. విజయ డెయిరీలో జరుగుతున్న అవినీతి అక్రమాలను వెలికి తీయాలని కోరుతూ.. ఆదివారం పాడి పరిశ్రమ రైతులతో పాటు డైరెక్టర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతనెలలో నంద్యాలలో విజయ డెయిరీ సర్వసభ్య సమావేశం నిర్వహి స్తున్నట్లు సమాచారం ఇచ్చి కర్నూలులో జరపడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. 15 మంది డైరెక్టర్లలో ఐదుగురిని ఎందుకు తొలగిం చారో చెప్పాలని ప్రశ్నించారు. అనవసరంగా డెయిరీ సొమ్మును ఖర్చు చేస్తూ అభివృద్ధి చేశామని, నిధులను పక్కదారి పట్టించారని ఆరోపించారు. తాలుకా సీఐ ఈశ్వరయ్య, గంగయ్య యాదవ్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

కర్నూలు జిల్లా త్యాగధనుల ఖిల్లా

- మహనీయుల స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి
- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కర్నూలు కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): 'ఉమ్మడి కర్నూలు జిల్లా త్యాగధనుల ఖిల్లా. ఎందరో మహనీయులు, కవులు, కళాకారులు, ప్రజా ప్రతినిధులు ఈ గడ్డకు పేరు ప్రఖ్యాతులు తెచ్చారు..' అని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కొనసాగుతున్న 'కర్నూలు ఉత్సవ్-2025' రెండో రోజు ఆదివారం ఉదయం 10 గంటలకు ఏకాంకి పౌరాణిక పద్య నాటక పోటీలను టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య ప్రారంభించారు. సాయంత్రం 6 గంటల వరకు కొనసాగాయి. సాయంత్రం ప్రదర్శనలకు ముఖ్య అతిథిగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హాజరయ్యారు. ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. అంతకు ముందు కళాక్షేత్రం ఆవరణలో ఏర్పాటు చేసిన తెలుగుతల్లి, అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్ర పటాలకు ఎమ్మెల్యే పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం అలనాటి స్వాతంత్ర్య సమరయోధులు, జిల్లాకు చెందిన సీనియర్ రంగస్థల కళాకారుల ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆసక్తిగా తిలకించారు.

మిగతా 7వ పేజీలో



ప్రదర్శనలు ప్రారంభిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



జయహో భారత్..

ముచ్చటగా మూడోసారి ప్రపంచకప్ ఫైనల్ చేరిన భారత మహిళల జట్టు అనుకున్నది సాధించింది. మెగా టైటిల్ ఫైట్‌లో దక్షిణాఫ్రికాతో ఆదివారం జరిగిన ఉత్కంఠ మ్యాచ్‌లో భారత్ గెలుపొందింది. సెమీస్‌లో గెలిచిన అనంతరం క్రికెట్ అభిమానుల్లో ఫైనల్ మ్యాచ్‌పై ఆశలు పెరిగాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా క్రీడాభిమానులు, నాయకులు భారీ ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి దేశభక్తిని చాటుకున్నారు. ఆత్మకూరు పట్టణంలోని గౌడ్ సెంటర్‌లో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎల్ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి భారత మహిళల జట్టు గెలుపొందగానే యువకులు కేరింతలు కొడుతూ సంబరాలు చేసుకున్నారు.

● ఆత్మకూరు (ఆంధ్రజ్యోతి)

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నంద్యాల నూనెపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కలెక్టరేట్‌తో పాటు మండల, డివిజన్, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజకుమారి ఆదివారం తెలిపారు. ప్రజలు అర్జీలను ప్రత్యక్షంగా ఇవ్వడమే కాకుండా ఆన్‌లైన్ ద్వారా కూడా పిర్యాదు చేయవచ్చునన్నారు. పరిష్కార స్థితి గురించి తెలుసుకోవడానికి టోల్ ఫ్రీ నెంబర్ 1100 ద్వారా తెలుకోవచ్చని తెలిపారు. మండల, డివిజన్, మున్సిపల్ కార్యాలయాల్లో సమస్యలు పరిష్కారం కాకపోతే జిల్లా కేంద్రంలోని వేదికకు రావాలని సూచించారు.

డయల్ యువర్ విద్యుత్ సీఎండీ

కల్లూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో ప్రతి సోమవారం డయల్ యువర్ ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చైర్మన్, మెనేజింగ్ డైరెక్టర్, ఐఏఎస్ లోతేటి శివశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొట్టమొదటిసారిగా ప్రజల నుండి నేరుగా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారమే లక్ష్యంగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. అందులో భాగంగా డిస్కం పరిధిలోని తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, అనంతపురం, నంద్యాల, కర్నూలు, శ్రీసత్యసాయి జిల్లాల వినియోగదారులు మొబైల్ నంబర్: 8977716661కు కాల్ చేయాలని సూచించారు. ఆయా జిల్లాల పరిధిలోని విద్యుత్ సమస్యలను సీఎండీ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ప్రతి సోమవారం ఉదయం 10 నుండి 12 గంటల వరకు డయల్ యువర్ సీఎండీ కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే వినియోగదారులు మొబైల్ నెంబరు : 9133331912కు చాట్ చేయడం ద్వారా సమస్యలను అధికారులకు తెలియజేయవచ్చన్నారు.

బ్రహ్మంగారికి పట్టు వస్త్రాలు



బ్రహ్మంగారికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న మహానంది ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి

మహానంది, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జయంతిని పురస్కరించుకొని కందికాయపల్లె మఠంలో ఆదివారం మహానంది దేవస్థానం నుండి పట్టు వస్త్రాలను తీసికెళ్లి సమర్పించారు. ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డితో పాటు వేదపండితుడు హనుమంతు శర్మ, ప్రధాన అర్చకులు జనార్దన్‌శర్మ, శంకరయ్యశర్మ, తదితరులు మహానంది నుండి వైఎస్ఆర్ జిల్లా కందికాయపల్లిలోని బ్రహ్మంగారి మఠానికి ప్రత్యేక వాహనంలో పట్టు వస్త్రాలను తీసుకెళ్ళారు. మఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలను సమర్పించారు.

శనగ సాగేనా ..!



శనగ కోసం సిద్ధం చేసిన పొలాల్లో నిలిచి ఉన్న వర్షపు నీరు

- అదను దాటుతోందని రైతుల ఆందోళన
- పదో తేదీ వరకే అవకాశం
- నేటికీ పొలాల్లో వర్షపు నీరు
- ప్రత్యామ్నాయ పంటలేమిటో అంతుపట్టని పరిస్థితి


కొలిమిగుండ్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అతివృష్టి, అనావృష్టి మధ్య రైతులు తీవ్రమైన కష్టాలను ఎదుర్కొంటున్నారు. జిల్లాలో అత్యధికంగా సాగయ్యే పప్పు శనగకు అదను దాటుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పప్పు శనగ నంద్యాల జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 1,50,000 ఎకరాలు కాగా, ఒక్క కోవెలకుంట్ల, వ్యవసాయ సబ్ డివిజన్‌లోనే 1లక్ష ఎకరాలకు పైగా శనగ సాగు చేస్తారు. జిల్లాలోని 29 మండలాల్లో గతేడాది 1,30,000 ఎకరాల్లో రైతులు శనగ సాగుచేశారు. ఈ ఏడాది కూడా ఇదే స్థాయిలో శనగ సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు 11,950 క్వింటాళ్ల సబ్సిడీ శనగలు ఇప్పటికే రైతులకు పంపిణీ చేశారు. అయితే గత నెల రోజులుగా జోరుగా కురుస్తున్న వర్షాలతో పప్పు శనగ సాగుకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 10 శాతం కుడా శనగ సాగుకు నోచుకోలేదని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పొలాల్లో ఎరువులు విత్తుకున్న అన్నదాతలు, శనగ సాగుకు వర్షం అడ్డంకిగా మారడంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదను తప్పితే భూమిలో పోసిన లక్షలాది రూపాయల విలువచేసే ఎరువులు నష్టపోవాల్సిందేనని అన్నదాతలు వాపోతున్నారు. సహజంగా శనగ సాగు రైతన్నలు అక్టోబరు-1 నుండి ప్రారంభించి, నెలాఖరులోపు దాదాపు సాగును ముగిస్తారు. అయితే ఈఏడాది మొంథా తుఫాన్, అంతకుముందు కురిసిన అధిక వర్షాలతో శనగ సాగుపై నీలి నీడలు కమ్ముకున్నాయి. తుఫాన్ భారీ వర్షాల నేపథ్యంలో నేటికీ పొలాల్లో నీరు ఇంకి పోలేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరు పూర్తిగా ఎండి పోవడానికి మరో వారం రోజులైనా పట్టవచ్చు. సహజంగా నవంబరు-10, 15 తర్వాత శనగ సాగు చేసుకోవడానికి అవకాశం ఉండదని రైతులతో పాటు, వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో శనగ రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించక తప్పదన్న వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో జిల్లాలోనే అత్యధికంగా బనగానపల్లె, కోవెలకుంట్ల, సంజామల, కొలిమిగుండ్ల, దొర్నిపాడు, ఉయ్యాలవాడ, అవుకు తదితర మండలాల్లో శనగ సాగుచేసే రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు నవంబరు-4 తర్వాత బంగాళఖాతంలో మరో అల్పపీడనంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతులు మరింత ఆందోళనపడుతున్నారు.

ఉన్నతాధికారులను సంప్రదిస్తున్నాం



కోవెలకుంట్ల డివిజన్‌లో లక్ష ఎకరాలు శనగ సాగవుతుంది. ఇప్పటి వరకు 10శాతం సాగు కూడా పూర్తి కాలేదు. నవంబరు-15వరకే శనగ సాగుకు అవకాశం ఉంది. అదను తప్పితే ప్రత్యామ్నాయంగా రైతులకు ఏ పంటలు సూచించాలనే విషయంపై ఉన్నతాధికారులను సంప్రదిస్తున్నాం.

-సుధాకర్, వ్యవసాయ శాఖ ఏడీఏ



కొలిమిగుండ్ల వద్ద ముందస్తుగా సాగు చేసిన శనగ

ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ, టెట్, కానిస్టేబుల్, ఎస్ఐ తదితర పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనార్టీల ఫైనాన్స్ కార్పొరేషన్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహక సంచాలకులు పర్వీన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ సీఈడీఎంఎండబ్ల్యూడీ.ఓఆర్జీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 0866-2970567ను సంప్రదించాలని కోరారు.

భక్తులతో శ్రీమఠం కిటకిట



భక్తులతో కిటకిటలాడుతున్న మధ్వమార్గ్ కారిడార్

మంత్రాలయం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం తరలివచ్చిన భక్తులతో భక్తజనసాగరంగా మారింది. ఆదివారం సెలవు దినం కావడంతో వేలాది మంది మంత్రాలయానికి తరలివచ్చారు. దీంతో స్వామి దర్శనానికి 4 గంటల సమయం పట్టింది. మధ్వమార్గ్ కారిడార్, తుంగభద్ర కారిడార్, శ్రీమఠం ప్రాంగణం, రాఘవేంద్రస్వామి మఠం ప్రాంగణం ప్రధాన రహదారులు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఏకాదశి కావడంతో ఎటువంటి ప్రత్యేక పూజలు, రథోత్సవాలు, ప్రసాదాలు లేవు. భక్తులు తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి రాఘవేంద్రస్వామి నిజ బృందావనాన్ని దర్శించుకున్నారు.

5న లక్ష దీపోత్సవం



కరపత్రాలను విడుదల చేస్తున్న కార్తీక దీపోత్సవ సమితి మహిళా ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో ఐదోతేదీ బుధవారం కార్తీక పౌర్ణమిని సందర్భంగా లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు దీపోత్సవ సమితి కార్యాధ్యక్షురాలు పద్మావతి, కార్యదర్శులు స్వప్నసారధి, జయలక్ష్మి తెలిపారు. ఆదివారం కలెక్టరేట్ సమీపంలోని సాలమ్మ సత్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం వారు దీపోత్సవ వివరాలు తెలిపే కరపత్రాలు విడుదల చేశారు. పన్నెండేళ్లుగా ఏటా కార్తీక పౌర్ణమి రోజున నగరంలోని కేసీ కెనాల్ వినాయక ఘాట్ వద్ద మహిళలతో సామూహికంగా దీపోత్సవాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఐదో తేదీ సాయంత్రం 4 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, శివపార్వతుల రథం ఊరేగింపు, ఆకాశదీపం, శివపార్వతులకు అభిషేకం, కల్యాణోత్సవం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. వీటితో పాటు తుంగాహారతి, లక్షదీపోత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ వేడుకల్లో దీపోత్సవ సమితి గౌరవాధ్యక్షులు మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ సతీమణి టీజీ రాజ్యలక్ష్మి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ శమంతకమణి తదితరులు హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో సమితి ప్రతినిధులు రాధిక, అనురాధ, హేమ, సలహాదారులు మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ కంపెనీకి వినియోగదారుల కమిషన్ వడ్డింపు

కర్నూలు లీగల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పాలసీదారుడికి చెల్లించాల్సిన మెడికల్ క్లయిమ్ బిల్లును పూర్తిగా చెల్లించకుండా సేవాలోపం చేసిన ఇఫ్కో టోక్యో ఇన్సూరెన్స్ కంపెనీకి జిల్లా వినియోగదారుల కమిషన్ తగిన రీతిలో వడ్డించింది. కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డీజీఎంగా పని చేస్తున్న ఉమామహేశ్వరరెడ్డి బ్యాంకు గ్రూప్ ఇన్సూరెన్స్ మెడికల్ పాలసీని తీసుకున్నారు. ఆ తర్వాత ఉమా మహేశ్వరరెడ్డి కూతురు కంటి ఆపరేషన్‌కు రూ.1.20లక్షలు ఖర్చు చేశారు. అయితే ఇన్సూరెన్స్ కంపెనీ కేవలం రూ.60వేలు మాత్రమే చెల్లించింది. దీంతో ఉమామహేశ్వరరెడ్డి సదరు కంపెనీపై జిల్లా వినియోగదారుల కమిషన్‌లో కేసును దాఖలు చేశారు. క్లెయిమ్‌ను అసంపూర్తిగా పరిష్కరించడం సేవాలోపం అవుతుందని వినియోగదారుల కమిషనర్ నిర్ధారించింది. దీంతో ఫిర్యాదికి మెడికల్ క్లయిమ్ కింద రూ.30వేలు, మానసిక ఆవేదనకు గురి చేసినందుకు రూ.10వేలు, కోర్టు ఖర్చుల కింద అదనంగా మరో రూ.5వేలను చెల్లించాలని ఆదేశిస్తూ జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్ కరణం కిషోర్ కుమార్, సభ్యులు ఎన్.నారాయణరెడ్డి, నజీమ కౌసర్లు ఆదేశాలు జారీ చేశారు.

నేడు షటిల్, చెస్ జట్ల ఎంపిక

నంద్యాల హాస్పిటల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని బొమ్మలసత్రం వద్ద ఉన్న నంది బాడ్మింటన్ అకాడమీలో సోమవారం ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి షటిల్ బాడ్మింటన్, చెస్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు బి. విశ్వనాథ్, జి. ఆశాజ్యోతి తెలిపారు. అండర్-14, 17 బాల, బాలికల విభాగాల్లో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా జట్లను ఎంపిక చేస్తామన్నారు. డివిజన్ స్థాయిలో ఎంపికైన క్రీడాకారులే జిల్లా స్థాయిలో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఎంపికైన అండర్-17 షటిల్ బాడ్మింటన్ బాల, బాలికల జట్లు ఈనెల 5న తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్ కాంప్లెక్స్‌లో జరిగే రాష్ట్ర స్థాయిలో పాల్గొంటాయన్నారు.

ఎర్రచందనం రక్షణకు కొత్త రేంజ్



రుద్రవరం ఫారెస్టు రేంజ్ కార్యాలయం

● చాగలమర్రి కేంద్రంగా ప్రతిపాదనలు

రుద్రవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా రుద్రవరం ఫారెస్టు సబ్ డివిజన్‌లో ఎర్రచందనం వృక్ష సంపద రక్షణకు చాగలమర్రి కేంద్రంగా కొత్తగా రేంజ్ కార్యాలయం ఏర్పాటు చేయడానికి ఫారెస్టు శాఖ ఉన్నతాధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. రుద్రవరం ఫారెస్టు రేంజ్ సబ్ డివిజన్ పరిధిలో రుద్రవరం, చెలిమ రేంజ్‌లున్నాయి. కొత్తగా చాగలమర్రి రేంజ్ కూడా సబ్ డివిజను పరిధిలోకి వస్తుందని ఫారెస్టు అధికారులు తెలిపారు.

రుద్రవరం ఫారెస్టు రేంజ్ విభజన ఇలా

ప్రస్తుతం రుద్రవరం రేంజ్ 22,920.54 హెక్టార్లులో ఉంది. చాగలమర్రి ఫారెస్టు రేంజ్ ఏర్పాటు చేస్తే అది 19193.43 హెక్టార్లలో ఉంటుంది. అందులో నాలుగు సెక్షన్లు, 9 బీట్‌లు ఉంటాయి. పాతబీట్‌లు 4వేల హెక్టార్ల పైబడి విస్తరించి ఉంది. వాటిని ఫారెస్టుశాఖ ఉన్నతాధికారులు విభజించాలని ప్రణాళికలు తయారు చేశారు. ఎర్రచందనం వృక్ష సంపద రక్షణకు ఈ ఏర్పాట్లు చేయనున్నారు.

కొత్త రేంజ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం



రుద్రవరం రేంజ్‌ను రెండుగా విభజించి చాగలమర్రి కేంద్రంగా కొత్త రేంజ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు పంపించాం. ఎర్రచందనం సంరక్షణకు ఈ చర్యలు తీసుకుంటున్నాం.

\- ముర్తుజావలి, రేంజర్, రుద్రవరం



ఎర్రచందనం వృక్షాలు

ఉసిరికాయలపై కార్తీక శోభ



ఉసిరికాయల మీద కార్తీక మాస ప్రత్యేక చిత్రాలు

నంద్యాల కల్చరల్, నవంబరు 02(ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేశ్ కార్తీకమాసం సోమవారం సందర్భంగా ఉసిరి కాయలపై మూడు ప్రధానమైన చిత్రాలను మైక్రోబ్రష్ ద్వారా ఆక్రాలిక్ కలర్స్‌తో వేశారు. కార్తీకమాసంలో ఉసిరికి గొప్ప ప్రాధాన్యం ఉంది. ఉసిరి చెట్టు సాక్షాత్తు శివుని స్వరూపం అని చెబుతారు. అన్ని మాసాల కంటే కార్తీకమాసం ఎంతో పవిత్ర మాసం. ఈ మాసంలో సోమవారాలకు, కార్తీక పౌర్ణమికి ఎంతో విశిష్టత ఉంది. ఈ మాసంలో ఉసిరికాయలతో దీపాలు వెలిగించి భక్తితో పూజలు చేస్తారు. ఉసిరిచెట్టును పూజించడం వలన సకల శుభాలు కలుగుతాయని, నవగ్రహదోషాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. అందుకే ఎంతో విశిష్టత వున్న ఉసిరికాయ మీద చిత్రకారుడు కోటేశ్ సూక్ష్మ చిత్రాలు వేశాడు. ఈ చిత్రంలో పరమశివుడు అర్ధనారీశ్వరుని రూపంలో చిరునవ్వుతో భక్తులకు దర్శనమిచ్చి దీవిస్తున్నట్లు, ఉసిరి చెట్టు కింద ఉసిరి కాయలతో దీపాలు వెలిగించి భక్తులు పూజిస్తున్నట్లు, శివలింగం, శివాలయం, ప్రకృతి దృశ్యాలు, స్త్రీలు కార్తీక దీపాలు నదిలో వదిలి భక్తితో మొక్కుతున్నట్లు, భక్తులు పుణ్యనదిలో స్నానాలు చేస్తున్నట్లు ఇలా కార్తీకశోభను ఒకే చిన్న ఉసిరి కాయ మీద వేశారు.

ముగిసిన అంతర్జాతీయ నృత్యోత్సవం



ప్రతిభ కనపరిచిన కళాకారులకు బహుమతులు అందజేస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు

ఆళ్లగడ్డ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో అంతర్జాతీయ నవనరసింహుల నృత్యోత్సవం ఆదివారం ముగిసింది. శ్రీసాయి నాట్యాంజలి ఫైన్ ఆర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఈ నృత్యోత్సవాన్ని నిర్వహించారు. స్వామివారిని స్తుతిస్తూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు చేసిన నృత్య ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ నృత్య ప్రదర్శనలో ప్రతిభ కనపరిచిన కళాకారులను అతిథులు, గురువులు జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఫెస్టివల్ డైరెక్టర్ డాక్టర్ పల్లెంశెట్టి సురేష్ మాట్లాడుతూ సాంప్రదాయ కళలను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో కథాకళి నాట్యగురువు శ్రీనివాస వరప్రసాద్, కూచిపూడి నాట్యగురువు సంధ్యాదేవి, మహేష్, వేణుగోపాల్, సత్య, సూరజ్, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు పాల్గొన్నారు.

దోపిడీ సమాజాన్ని బోనెక్కించిన రావిశాస్త్రి

సాహితీవేత్త వృద్ధుల కల్యాణ రామారావు



ప్రసంగిస్తున్న ప్రముఖ సాహితీవేత్త వృద్ధుల కల్యాణ రామారావు

కర్నూలు కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దోపిడీ సమాజాన్ని బోనులో నిలబెట్టిన సాహితీవేత్త రాచకొండ విశ్వనాథ శాస్త్రి అని ప్రముఖ సాహితీవేత్త వృద్ధుల కల్యాణ రామారావు అన్నారు. ఆదివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రం సాహిత్య సమావేశ హాలులో సాహితీ స్రవంతి సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో 'రావిశాస్త్రి సాహిత్యం - ఒక పరిశీలన' అనే అంశంపై సభ నిర్వహించారు. తొలుత రావిశాస్త్రి చిత్ర పటానికి పూలదండలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఈ సదస్సుకు ముఖ్య వక్తగా విచ్చేసిన కల్యాణ రామారావు మాట్లాడుతూ లెఫ్టిస్టులు సమాజానికి వ్యతిరేకులు అనే ధోరణి పాలకుల్లో పెరిగిపోతోందని, దీనికి సాహిత్య, సాంస్కృతిక ఉద్యమాలే పరిష్కారం చూపుతాయని అన్నారు. దోపిడీ సమాజంలోని అసమానతలు కళ్లకు కట్టినట్లు రావిశాస్త్రి చూపించారని అన్నారు. సాహిత్యం ద్వారా గొప్ప సమాజం ఆవిష్కృతమవుతుందని నిరూపించిన ఏకైక రచయిత రావిశాస్త్రి అన్నారు. సభకు అధ్యక్షత వహించిన సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ మాట్లాడుతూ రావిశాస్త్రి సాహిత్యం నేడు ఔత్సాహిక రచయితలు అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంధ్యాల రఘుబాబు మాట్లాడుతూ రావిశాస్త్రి కథలు ఒక్కొక్కటీ ఒక్కో ఆణిముత్యంలా నిలిచిపోతుందని అన్నారు. ఈ సదస్సులో సాహితీవేత్తలు చంద్రశేఖర శర్మ, ఎస్ఎండీ ఇనాయతుల్లా, విరసం నాయకుడు నాగేశ్వరరాచారి, సాహితీ స్రవంతి జిల్లా బాధ్యుడు ఆవుల చక్రపాణి, బాలగొని మధు, కథా రచయిత టి మధుసూదన శర్మ తదితరులు పాల్గొన్నారు.

అంధ విద్యార్థులకు 220 పాకెట్ల బియ్యం



అంధుల అనాథాశ్రమానికి బియ్యం పంపిస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి హైదరాబాద్‌లోని దేవనార్ అంధుల పాఠశాలకు 200 పాకెట్లు సోనా మసూరి బియ్యాన్ని,అలాగే కడప జిల్లా సిద్ధవటంలోని అనాథ ఆశ్రమానికి మరో 20 పాకెట్లు ఆదివారం వితరణ చేశారు. తన తల్లిదండ్రులు బీసీ గుర్రెడ్డి, బీసీ లక్ష్మమ్మల జ్ఞాపకార్థం గత నాలుగేళ్లుగా అనాథ ఆశ్రమాలకు ఆయన బియ్యం పాకెట్లు అందజేస్తున్నారు. ఈఏడాది రూ.6.20 లక్షల విలువ చేసే 50 కిలోలు గల 220 పాకెట్లు బియ్యాన్ని అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉపసర్పంచ్ బురానుద్దీన్, వంగల పరమేశ్వరరెడ్డి, అమర్‌నాథరెడ్డి పాల్గొన్నారు.

నదిలో స్నానానికి వెళ్లి యువకుడి మృతి

మంత్రాలయం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని తుంగభద్ర గ్రామానికి చెందిన అమ్రేష్ గౌడు, ఈశ్వరమ్మ దంపతుల కుమారుడు వీరేంద్రగౌడు (24) అనే యువకుడు తుంగభద్ర నదిలో స్నానానికి వెళ్లి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం జరిగింది. మాధవరం ఎస్ఐ విజయకుమార్, వీరేంద్రగౌడు బంధువులు తెలిపిన వివరాలివీ.. వీరేంద్ర గౌడ్ ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం తోటి స్నేహితులతో కలిసి రైల్వేబ్రిడ్జి సమీపంలో తుంగభద్ర నదిలో స్నానానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు నదిలో గల్లంతయ్యాడు. అక్కడే ఉన్న స్నేహితులు కాపాడే ప్రయత్నం చేశారు. నీటిలో నుంచి బయటకు తెచ్చేలోపు ప్రాణాలు కోల్పోయాడు. మాధవరం పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యువకుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం

అవుకు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని కొండమనాయునిపల్లె గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన కోనేటి వెంకటన్న(60) జీవాలను కాచుకుంటూ, కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగించేవాడు. కుటుంబ కలహాలు జరిగేవి. ఈ కారణంగా గ్రామ సమీపంలోని పొలాల్లోకి వెళ్లి ఉరేసుకున్నాడు. స్థానికులు సమాచారమివ్వగా కుటుంబ సభ్యులు ఘటనాస్థలికి వెళ్లి అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు..



బత్తు కిరణ్ (ఫైల్)

వెలుగోడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వెలుగోడు పట్టణంలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం జరిగింది. పట్టణంలోని ఎస్సీజీ పాలెంకు చెందిన బట్టు ప్రసాద్ కుమారుడు కిరణ్ (38) బస్టాండు సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడు వలంటీర్‌గా పనిచేసి ప్రస్తుతం ఖాళీగా ఉండి తాగుడుకు అలవాటుపడ్డాడు. శనివారం రాత్రి బయటకు వెళ్లిన కిరణ్ బస్టాండు సమీపంలో మృతి చెందాడు. మృతుడి అన్న చెన్నయ్య పోలీసులకు సమాచారం అందించగా, వారు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, శవ పరీక్ష నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కర్నూలు జిల్లా త్యాగధనుల ఖిల్లా

(5వ పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గౌరు చరితారెడ్డి ప్రసంగిస్తూ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా వారం రోజుల పాటూ జిల్లా సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసే విధంగా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి ఉంచారని గుర్తు చేశారు. కళాకారులకు ఇళ్లు, ఇంటి స్థలాలు, పింఛన్లు ఇతర అంశాలపై తనవంతు సహకారం అందిస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సి.యాగంటీశ్వరప్ప, పూర్వ అధ్యక్షుడు పి.దస్తగిరి, కళాక్షేత్రం ప్రతినిధులు సీవీ రెడ్డి, మహమ్మద్ మియా, బాల వెంకటేశ్వర్లు, సంగా ఆంజనేయులు, పి.రాజారత్నం, జీవీ శ్రీనివాసరెడ్డి, గాండ్ల లక్ష్మన్న, కేవీ రమణ, రాముడు, కదిరి రమేష్, ఈశ్వరయ్య, పీపీ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

● రంగస్థల కళాకారులకు పురస్కారాలు : కర్నూలు ఉత్సవ్-2025 రెండోరోజు నాటక రంగంలో విశేష కృషి చేసిన వారికి విశిష్ట పురస్కారాలు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అందజేశారు. పురస్కారాలు అందుకున్న నటీనటుల్లో రంగారెడ్డి (పత్తికొండ), మల్లారెడ్డి (హుసేనాపురం), హెచ్. చంద్రన్న, ఎంఆర్ రాధిక, సి.శ్రీనివాసులు (మేకప్‌మెన్), (కర్నూలు), సిద్దయ్య (ఆళ్లగడ్డ), సాయిబాబా (తూడిచర్ల), శారదాబాయి, రామబ్రహ్మం (మేకప్‌మెన్, నంద్యాల) ఉన్నారు. కళాకారులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం, శాలువతో ఘనంగా సత్కరించారు. ఇదిలా ఉండగా సాయిప్రదీప్ ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్రీనివాసులు బృందం, ప్రజా వేదిక కరుణాకర్ బృందం కోలాట ప్రదర్శన, గజల్ గాయకుడు మహ్మద్ మియా ఆధ్వర్యంలో కళాకారుల జానపద సంగీత విభావరి ఆకట్టుకుంది.



పాణ్యం ఎమ్మెల్యేతో నృత్య ప్రదర్శనలు చేసిన కళాకారులు

అధ్యాపకుల తొలగింపునకు కుట్ర



● ఖండించిన విద్యార్థి సంఘాలు
● కోర్టు ఉత్తర్వులు సైతం ధిక్కరణ?
● మందకృష్ణ మాదిగను కలిసిన అధ్యాపకులు
● నేడు ఆర్‌యూ ఎదుట ఆందోళన

కర్నూలు అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పర్ఫార్మెన్స్ రివ్యూ పేరుతో ఆరుగురు అధ్యాపకుల తొలగింపునకు యూనివర్సిటీ అధికారులు కుట్ర చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. ఆర్‌యూ (రాయలసీమ యూనివర్సిటీ)లో ఆగస్టు 28, 29 తేదీల్లో వర్సిటీలో పనిచేస్తున్న 49 మంది కాంట్రాక్టు, టైం స్కేల్ అధ్యాపకులకు పర్ఫార్మెన్స్ రివ్యూ పేరుతో ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీటిని వ్యతిరేకిస్తూ వర్సిటీలో 2007 నుంచి పని చేస్తున్న అధ్యాపకులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు ఇంటర్వ్యూలకు హాజరు కాలేదు. వారిని విధుల నుంచి తొలగించినట్లు ఆర్‌యూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వీటిని వ్యతిరేకిస్తూ తమపై కక్ష సాధింపు చర్యలకు పూనుకుంటున్నారని అధ్యాపకులు మరోసారి కోర్టును ఆశ్రయించారు. కోర్టు వీరికి అనుకూలంగా ఇచ్చిన ఆదేశాలను సైతం ధిక్కరిస్తూ వీసీ, రిజిస్ట్రార్ వ్యవహరించారు. అధ్యాపకుల తొలగింపు విద్యార్థి సంఘాలు సైతం ఖండించాయి. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను అధ్యాపకులు ఆశ్రయించారు. స్పందించిన ఆయన బడుగు, బలహీనవర్గాలను వేధించడం సరైన పద్ధతి కాదని అన్నారు. ఉన్నత వర్గాల వారిని వదిలేసి బడుగులు వర్గాలు, విద్యార్థులకు పాఠాలు బోధించే వారిని కడుపు కొడతారా? ఇదెక్కడి న్యాయం.. ఆందోళనలు చేపట్టండి.. నేను వస్తా అని మందక్రిష్ణ హామీ ఇచ్చారని అధ్యాపకులు తెలిపారు.

ఆందోళనలకు సిద్ధం

రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఒక్క రాయలసీమ యూని వర్సిటీలోనే పర్ఫార్మెన్స్ ఇంటర్వ్యూలు నిర్వహించడం ఎంతవరకు సమంజసమని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. ఆర్‌యూ అధికారుల పనితీరును నిరసిస్తూ సోమవారం నుంచి వర్సిటీ ఎదుట నిరవధిక దీక్ష, ఆందోళనలు చేపట్టేందుకు అధ్యాపకులు కార్యాచరణకు సిద్ధమయ్యారు. వీరికి మద్దతుగా రాష్ట్రంలోని 17 యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అధ్యాపకులు కూడా ఆందోళనలు చేస్తామని హామీ ఇచ్చారని అధ్యాపకులు తెలిపారు. వీరికి మద్దతుగా విద్యార్థి సంఘాలు సైతం మద్దతు ప్రకటించాయి.

న్యాయం జరగడం లేదు

తమ సమస్యల పరిష్కారం కోసం కోర్టు ఉత్తర్వులతో రిజిస్ట్రార్‌ను సంప్రదించాం. న్యాయం జరగడం లేదు. మరోసారి సోమవారం కలుస్తాం. స్పందించని పక్షంలో ఆందోళనలు చేపడుతాం. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు అధ్యాపకులు మద్దతు తెలిపారు. అవసరమైతే కలెక్టర్‌ను కలిసి కోర్టు ఆదేశాలు అమలు చేయాలని కోరతాం.

●సాయినాథ్, సెక్రటరీ, కాంట్రాక్టు టీచర్స్ అసోసియేషన్


అధ్యాపకుల జీవితాలతో చెలగాటం..

హైకోర్టు ఉత్తర్వులు అమలుచేయకుండా కాంట్రాక్టు అధ్యాపకుల జీవితాలతో చెలగాట మాడటం సరికాదు. అధికారులు వెంటనే స్పందించాలి. యూజీసీ నిబంధనల మేరకు అకాడమీ పర్ఫార్మెన్స్ రివ్యూకు హాజరు కావాల్సిన అవసరం లేదని హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. అధ్యాపకులను విధుల్లో తీసుకోవాలని, పకులను విధుల్లోకి తీసుకోవాలి. లేని పక్షంలో వారికి మద్దతుగా ఆందోళన చేపడతాం.

●మహేంద్రబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి, పీడీఎస్‌యూ

ప్రథమ నందీశ్వరాలయంలో కార్తీక పూజలు

నంద్యాల కల్చరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రథమనందీశ్వరాలయంలో కార్తీకమాసం ఆదివారం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అభిషేకాలు చేశారు. మాజీ ఎంపీ గంగుల ప్రతాపరెడ్డి కుటుంబ సమేతంతా వచ్చి నంద్యాల ప్రథమనందీశ్వరుడికి అభిషేకాలు, అమ్మవారికి ప్రత్యేక కుంకు మార్చనలు చేశారు. అనంతరం నిత్యాన్నదానంలో పాల్గొన్నారు. భక్తులు దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో సాయిరాంరెడ్డి, చలంబాబు, అర్చకులు ప్రవీణ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.


ప్రథమనందీశ్వరునికి అభిషేకం చేస్తున్న మాజీ ఎంపీ గంగుల ప్రతాప్‌రెడ్డి

'అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి'

నందికొట్కూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు కనీస వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) నందికొట్కూరు ప్రాజెక్టు కమిటీ సమావేశం అధ్యక్షురాలు మదర్‌బి అధ్యక్షతన నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి శివలక్ష్మి మాట్లాడుతూ నేటికీ అంగన్‌వాడీ వర్కర్లను అతి తక్కువ వేతనాలతో పని చేయించుకుంటున్నారన్నారు. కనీస వేతనాలు పెంచి సంక్షేమ పథకాలు అమలుచేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నందికొట్కూరు సీఐటీయూ పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ, యూనియన్ నాయకులు కుర్షిత్‌బి, సాజిదా, ప్రసన్న, పద్మావతమ్మ, రమణబాయి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రగా అష్టాదశ శక్తి పీఠాల దర్శనం

పాములపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్న అమ్మవారి 18 అష్టాదశ శక్తి పీఠాలను దర్శించుకునేందుకు పాదయాత్ర చేపట్టినట్లు బెంగళూరుకు చెందిన గీతామాత (త్రిశూలమాత) గురుస్వామి ఆంజనేయులు తెలిపారు. యాత్ర ఆదివారం పాములపాడుకు చేరింది. కేజీరోడ్డులో 'ఆంధ్రజ్యోతి' భక్తబృందాన్ని పలుకరించింది. మాతాజీ మాట్లాడుతూ లోక కల్యాణార్థం కోసం రెండు నెలల క్రితం కర్ణాటకలోని మైసూరు చాముండేశ్వరీదేవి అమ్మవారిని దర్శించుకొని పాదయాత్ర ప్రారంభించామన్నారు. కేదార్‌నాథ్ దర్శనంతో యాత్ర ముగుస్తుందన్నారు. అమ్మవారి అష్టదశ శక్తి పీఠాలు దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు.

దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ కాళ్లు, చేతులు

నంద్యాల కల్చరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు భారత్ వికాస్ పరిషత్ నంద్యాల శాఖ ఆధ్వర్యంలో నాణ్యమైన కృత్రిమ కాళ్లు, చేతులు కాలిపర్స్ ఉచితంగా ఇవ్వనున్నట్లు నిర్వాహకుడు ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు తమ పేర్లను ఈనెల 23లోగా మున్సిపల్ పార్కులో గల ఆయుష్ యోగా కేంద్రంలో నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలను సెల్ 9490202079, 9989983673 నంబర్లకు ఫోన్‌చేసి తెలుసుకోవచ్చన్నారు.

వామ్మో.. వాగులు

- వరదలు వచ్చాయంటే హడల్..
- స్తంభిస్తున్న రాకపోకలు
- హామీలకు పరిమితమైన వంతెనల నిర్మాణాలు
- ఇంకెన్నాళ్లీ కష్టాలంటున్న ప్రజలు
- టీడీపీ ప్రభుత్వంపైనే ఆశలు


ప్రమాదం అని తెలిసినా ఎద్దులేరు వాగు దాటుతున్న ప్రజలు

కొత్తపల్లి/జూపాడుబంగ్లా, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వాగులు ఉప్పొంగితే పలు గ్రామాలకు రాకపోకలు బంద్ అవుతున్నాయి. దాంతో గ్రామీణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరద వచ్చిన ప్రతిసారి ఇవేమి కష్టాలు తమకు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామాల సమీపంలో వంతెనలు నిర్మిస్తే తమకు ఈగోష ఉండదు కదా అంటూ ప్రశ్నిస్తున్నారు.

మూడు దశాబ్దాలకుపైగా కొత్తపల్లి మండల ప్రజలకు ఈ ఎద్దులేరు వాగు కష్టాలు తప్పడం లేదు. ఓ మోస్తారు వర్షం కురుస్తే.. మండలంలోని శివపురం గ్రామ శివారులో ఉన్న ఎద్దులేరు వాగు ఉప్పొంగి ప్రవహిస్తుంది. 15 గ్రామాల ప్రజల రాకపోకలు నిలిచిపోవడమే కాకుండా జనజీవనం కూడా స్తంభించిపోతుంది. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి ప్రజాప్రతినిధులు ఎద్దులేరు వాగుపై వంతెన నిర్మిస్తామని హామీ ఇవ్వడమే తప్ప.. అమలు కావడం లేదని పలువురు వాపోతున్నారు. గతంలో అత్యవసర పరిస్థితుల్లో ఈ వాగును దాటుతూ కొందరు మృత్యువాత పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. అంతేగాకుండా ఎన్నో మూగజీవాలు సైతం ఈ వాగు ఉధృతికి బలయ్యాయి. అయినా గత ప్రభుత్వాల్లో చలనం రావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వారంలో కురిసిన వర్షాలకు వాగు ఉధృతంగా ప్రవహించింది. రాకపోకలు నిలిచిపోయాయి. కొన్నిసార్లు ప్రమాదమని తెలిసినప్పటికీ ట్రాక్టర్ సాయంతో వాగు దాటుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా ఈ వాగుపై వంతెన నిర్మిస్తారనే ఆశతో ఈ మండల ప్రజలు ఆశాజనకంగా ఎదురు చూస్తున్నారు. అలాగే జూపాడుబంగ్లా మండలంలోని పారుమంచాల చెరువుపై నుంచి 80బన్నూరు వరకు కాకిలేరువాగు వర్షాకాలంలో ఉప్పొంగి ప్రవహిస్తుంది. వాగు వెంట ఉన్న పొలాలు మునగకు గురవుతున్నాయి. రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాగు ఉధృతంగా ఉన్నప్పుడు అవతలివైపు ఉన్న పొలాలకూ వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. అలాగే పి.లింగాపురం వద్ద రైతులు సాహసమే చేయాల్సి వస్తుంది. గ్రామానికి చెందిన దాదాపు 150 ఎకరాలు కాకిలేరు వాగు అవతలివైపు ఉన్నాయి. ఎన్నో ఏళ్ల నుంచి అధికారులకు, ప్రజాప్రతినిధులకు వంతెన నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడంలేదని రైతులు, గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వంతెన నిర్మిస్తే తమకు సమస్య ఉండదని, అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


పి.లింగాపురం వద్ద ప్రవహిస్తున్న కాకిలేరువాగు

ఎవరూ పట్టించుకోవడం లేదు



కాకిలేరువాగుపై వంతెన నిర్మించాలని ఏళ్ల నుంచి విజ్ఞప్తి చేస్తునే ఉన్నాం. వాగు ఉధృతి ఉన్న సమయంలో అవతలి వైపునకు వెళ్లాలంటే ప్రాణాలు అర చేతిలో పెట్టుకుని పోవాల్సిందే. ప్రజాప్రతినిధులు చొరవచూపి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

- వేణుగోపాల్‌రెడ్డి, రైతు, పి.లింగాపురం, జూపాడుబంగ్లా

రేపు వాహనాల వేలం

నంద్యాల టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేయనున్నట్ల ఈఎస్ రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 4న (మంగళవారం) ఉదయం 11 గంటలకు పది వాహనాలను వేలం చేస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

నేడు లక్ష దీపోత్సవం

శ్రీశైలం నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) :కార్తీక మాసోత్సవాల్లో నేడు రెండో సోమవారం కావడంతో భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా జరిపిస్తున్నట్లు ఈవో శ్రీనివాసరావు అన్నారు. లక్ష దీపోత్సవంతో పాటు పుష్కరిణికి ప్రత్యేక హారతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేసినట్లు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అందరికీ అలంకార దర్శనం మాత్రమే కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు దేవస్థానం అధికారులు, సిబ్బందికి సహకరించాలని కోరారు.

రేపు గాయత్రీ ఆలయ వార్షికోత్సవం

ఆత్మకూరు రూరల్ , నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో కరివేన గ్రామంలో వెలసిన గాయత్రీ మాత ఆలయంలో 14వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ పురోహితులు సత్య నారాయణ శర్మ ఆదివారం తెలిపారు. వేడుకల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, సామూహిక ధాత్రి పూజ, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఆలయ ఆవరణ లో దంపతుల ఆధ్వర్యంలో సంపూర్ణ నవగ్రహ ఆరాధన పూజాది కార్యక్రమం, మధ్యాహ్నం మహిళల ఆధ్వర్యంలో ఊరేగింపుగా తరలి వచ్చి అమ్మవారికి బోనాల సమర్పణ, సాయంత్రం అమ్మవారికి గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి సభ్యులు తెలిపారు.

పెట్రోల్‌లో నీళ్లు కలిశాయంటూ..

వినియోగదారుల ఆందోళన

ఆత్మకూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భారత్ పెట్రోల్ బంకులో విక్రయిస్తున్న పెట్రోల్‌లో నీళ్లు కలిశాయని పలువురు వినియోగదారులు ఆదివారం ఆందోళన చేపట్టారు. పెట్రోల్ బంకు నిర్వాహకుల నిర్లక్ష్యం వల్ల తమ బైకులు దెబ్బతిన్నాయని వాపోయారు. బాధితులు ఒక్కొక్కరిగా అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వినియోగదారులకు సర్దిచెప్పారు. అలాగే డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు కూడా అక్కడికి చేరుకుని విషయాన్ని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం ప్రత్యేక బృందం పరిశీలించిన తర్వాతే పెట్రోల్ విక్రయాలు జరపాలని తెలియజేశారు. అయితే నీళ్లు కలిసిన పెట్రోల్ విక్రయించడం వల్ల దెబ్బతిన్న తమ బైకుల పరిస్థితి ఏంటని వినియోగదారులు నిలదీశారు. పెట్రోల్‌లో 20శాతం ఇథనాల్ ఉండటం వల్లే సమస్య అని బంకు యాజమాన్యం తెలిపింది.


పెట్రోల్ బంకు వద్ద నిరసన వ్యక్తం చేస్తూ.. బాటిల్‌ను చూపుతున్న వినియోగదారుడు

ఆత్మకూరు డివిజన్ ఏపీఆర్ఎస్ఏ కమిటీ ఎన్నిక

ఆత్మకూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయంలో జరిగిన ఈ ఎన్నికలో అధ్యక్షుడిగా ఎన్.పెద్దన్న (రీసర్వే విభాగం డిప్యూటీ తహసీల్దార్, కొత్తపల్లి), అసోసియేట్ అధ్యక్షుడిగా కిశోర్ కుమార్ (డిప్యూటీ తహసీల్దార్, ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయం), ఉపాధ్యక్షురాలిగా అరుణ (డిప్యూటీ తహసీల్దార్, కొత్తపల్లి), నాగన్న (రీసర్వే విభాగం డిప్యూటీ తహసీల్దార్, జూపాడుబంగ్లా), కార్యదర్శిగా సత్యనారాయణ (రీసర్వే విభాగం డిప్యూటీ తహసీల్దార్, నందికొట్కూరు), ఆర్గనైజింగ్ సెక్రటరీగా పీ.మధు (డిప్యూటీ తహసీల్దార్, పగిడ్యాల), సహాయ కార్యదర్శులుగా రవికుమార్ (డిప్యూటీ తహసీల్దార్, ఆత్మకూరు), ఈశ్వరయ్య (ఆఫీసు సబార్డినేట్, వెలుగోడు తహసీల్దార్ కార్యాలయం), కోశాధికారిగా ఎం.ఆంజనేయులు (రీసర్వే విభాగం డిప్యూటీ తహసీల్దార్, ఆత్మకూరు), జిల్లా కౌన్సిల్ సభ్యులుగా శ్యామ్‌కుమార్ (జూనియర్ అసిస్టెంట్, బండిఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం), రాజశేఖరరెడ్డి (జూనియర్ అసిస్టెంట్, నందికొట్కూరు తహసీల్దార్ కార్యాలయం), ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా విశ్వనాథ్ (జూనియర్ అసిస్టెంట్, మిడ్తూరు తహసీల్దార్ ఆఫీసు), సుప్రియ (రీసర్వే విభాగం డిప్యూటీ తహసీల్దార్, పాములపాడు)లను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా అవుకు ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రసాద్‌బాబు వ్యవహరించారు.


నూతనంగా ఎన్నికైన కార్యవర్గం సభ్యులు

ఉపాధ్యాయులకు టెట్ మినహాయించాలి : ఏపీటీఎఫ్

నంద్యాల హాస్పిటల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అడహక్ కమిటీ సభ్యుడు కె.సాంబశివుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో జరిగిన అత్యవసర సమావేశంలో సాంబశివుడు మాట్లాడుతూ సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయుడు రెండేళ్లలో తప్పనిసరిగా టెట్ ఉత్తీర్ణులు కావాలని సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో ఏపీటీఎఫ్ పక్షాన రివ్యూ పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. విద్యాహక్కు చట్టం -2009లో అమలులోకి వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2011లో జీవో నెం.51ద్వారా 2010కి ముందు ఉపాధ్యాయులుగా చేరినవారికి టెట్ నుంచి మినహాయింపు ఇచ్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి విద్యాహక్కు చట్టంలో సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్లు గోపాల్‌రావు, జయరాం, జిల్లా అదనపు కార్యదర్శి పుల్లయ్య, కార్యదర్శులు పవన్‌కుమార్, రవి, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన కొత్తూరు దేవస్థానం

పాణ్యం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. కార్తీక మాసం ఆదివారం స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చా రు. ఆలయ అర్చకులు సురేష్ శర్మ, సుబ్బయ్య శర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు. భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఈవో రామకృష్ణ తెలిపారు. సత్రంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. వాహనాలు నిలుపుకోవడానికి సరైన స్థలం లేక పోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.


పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా తులసీ దామోదరుల కల్యాణం


తులసీ దామోదరుల కల్యాణంలో భక్తులు

నంద్యాల కల్చరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజీవనగర్ కోదండరామాలయంలో భగవత్ సేవా సమాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం తులసీ దామోదరుల కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్తీక మాసంలో క్షీరాబ్ది ద్వాదశి రోజున తులసిమొక్కకు, దామోదర మూర్తికి కల్యాణం చేస్తే లక్ష్మీదేవి, విష్ణుమూర్తి ఆశీస్సులు లభిస్తాయని భక్తుల నమ్మకం. కార్యక్రమంలో భగవత్ సేవాసమాజ్ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మైనర్ల డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్

- 30 మందికి రూ.5వేల చొప్పున జరిమానాలు

నంద్యాల టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా తెలిపారు. ఆదివారం పట్టణంలో పలు ప్రాంతాల్లో వాహనాలు నడుపుతున్న మైనర్లను పట్టుకున్నారు. సీఐ మాట్లాడుతూ వాహనాలు నడుపుతున్న 30 మంది మైనర్లను తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున రూ.1.50లక్షల జరిమానాలు విధించామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సమాధుల పండుగ


కొత్తపల్లిలో సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కొత్తపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి, దుద్యాల, గువ్వలకుంట్ల, లింగాపురం, శివపురం గ్రామాల్లో ఆదివారం సమాధుల పండుగను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రతి ఏడాది నవంబరు 2న క్రైస్తవులు సమాధుల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేసు కుంటారు. కొత్తపల్లి సీఎస్ఐ పాస్టరేట్ చైర్మన్ భరత్ దివాకర్ బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొవ్వొత్తులు వెలిగించారు.

ఆత్మకూరు: పట్టణంలోని ఎస్పీజీపాలెం సమీపంలోని సమాధుల తోటలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే మండలంలోని ఆయా గ్రామాల్లో కూడా క్రైస్తవులు సమాధుల వద్దకు వెళ్లి పూలతో అలంకరించి కొవ్వొత్తులు వెలిగించారు. తమ పూర్వీకుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థనలు నిర్వహించారు.

ప్రథమ నందీశ్వరాలయం ఈవోగా చంద్రుడు



నంద్యాల కల్చరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రథమ నందీశ్వరాలయం ఈవోగా చంద్రుడుని నియమించినట్లు నంద్యాల జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మోహన్ తెలిపారు. గతనెల 31న ఈవో రామానుజం పదవీ విరమణ చేయడంతో బోగేశ్వరాలయం ఈవో పనిచేస్తున్న చంద్రుడుకు ఈవో (ఎఫ్ఏసీ) బాధ్యతలు అప్పగించారు. ఈవో చంద్రుడు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి తన వంతు కృషి చేస్తాన న్నారు. ప్రస్తుతం భోగేశ్వరం, ప్రథమనంది, సూర్యనంది ఆల యాలకు ఈవో కొనసాగుతారు.

మహాసభలను జయప్రదం చేయాలి

మిడుతూరు, నవంబరు2(ఆంధ్రజ్యోతి): కడపలో వచ్చే నెల 6,7తేదీల్లో నిర్వహించనున్న తొమ్మిదవ మహాసభను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణంలో మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ మండల నాయకులు మేకల చంద్రశేఖర్, సామన్న, నాగరాజు, వెంకటస్వామి, సోమనాయుడు, శేషన్న పాల్గొన్నారు.

బాలల దినోత్సవ ఆటల పోటీలు

నంద్యాల హాస్పిటల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రైవేట్‌స్కూల్స్ అసోసియేషన్ టౌన్ యూనిట్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు గురురాజ ఇంగ్లీష్‌మీడియం పాఠశాల క్రీడామైదానంలో చైర్మన్ దస్తగిరిరెడ్డి ప్రారంభించారు. పోటీల్లో దాదాపు 35పాఠశాలల నుంచి 500మంది విద్యార్థులు పాల్గొన్నట్లు అధ్యక్షుడు కె.బాలమద్దిలేటి, సెక్రటరి బి.సురేష్‌బాబులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు నవంబరు 14న బాలల దినోత్సవంరోజు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో అపుస్మా ట్రెజరర్ జీవీ రమణయ్య గౌడ్, జిల్లా కార్యదర్శి బి.భాస్కర్, సలహాదారు వాసవి దస్తగిరి, గేమ్స్ కన్వీనర్లు వరప్రసాదరెడ్డి, జనార్దన్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు అశ్వకఅహమ్మద్, ఉపాధ్యక్షులు దశరథరామిరెడ్డి, మల్లికార్జున, ఖాజ, కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ఓపెన్ చెస్ పోటీలు ప్రారంభం

నంద్యాల హాస్పిటల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా చెస్ సంఘం, లయన్స్‌క్లబ్ సంయుక్త నిర్వహణలో ఆదివారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లాస్థాయి ఓపెన్ చెస్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను లయన్స్‌క్లబ్ వ్యవస్థాపక సభ్యులు ఆత్మకూరు సుదర్శనంశెట్టి, డాక్టర్ గెలివి సహదేవుడు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా చెస్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డా.రవికృష్ణ, రామసుబ్బారెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాలు విజయవంతం చేయాలి

నంద్యాల హాస్పిటల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబురాలు-2025ను విజయవంతం చేయాలని రాష్ట్ర జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి సురేష్ కోరారు. ఆదివారం నంద్యాలలోని జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 4న మండల స్థాయి చెకుముకి సంబరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు డా.టి.నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.గోపాల్, ట్రెజరర్ ఎస్వీ రమణ, ఉపాధ్యక్షుడు బి.రామరాజు, టి.చిన్నయ్య, ఖాజామొహిద్దీన్, సంజీవ్‌కుమార్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి గాయాలు

నంద్యాల టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో క్రాంతినగర్‌లో ముగ్గురికి గాయాలయ్యాయి. ఆదివారం తాలుకా సీఐ ఈశ్వరయ్య వివరాల ప్రకారం.. క్రాంతినగర్‌కు చెందిన భాస్కర్‌కు తన అక్క, బావ మహాలక్ష్మి, తిరుపతయ్య డబ్బులు ఇవ్వాల్సింది. ఎన్ని రోజులైనా ఇవ్వకపోవడంతో వారిని బెదించాలనే ఉద్దేశంతో ఒంటిపై పెట్రోల్ పోసుకున్నాడు. దీంతో పక్కనే రొట్టెలు కాల్చుతుండగా అక్కడి నుంచి మంటలు వ్యాపించి ముగ్గురికి గాయాలయ్యాయి. దీంతో కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి : ఎస్ఐ

శిరివెళ్ల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ చిన్న పీరయ్య సూచించారు. కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. రికార్డులు సరిగ్గాలేని పలు వాహనదారులకు చలానాలు విధించారు. మైనర్ వ్యక్తులు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరం అన్నారు. వాహనదారులు రహదారి నియమాలు పాటించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో తులసి పూజలు


పూజలు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కోదండ రామాలయం, భీమలింగేశ్వర, రామలింగేశ్వర ఆలయాల్లో కార్తీకమాసం క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా తులసీమాతకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు సామూహికంగా తులసీమాతకు పూలు, పండ్లతో అలంకరింప చేసి సామూహిక వడిబియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలకు రవిక, గాజులు, పసుపు కుంకుమ, పండ్లు సమర్పించారు. అనంతరం శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆలయాల కమిటీ సభ్యులు, మహిలు పాల్గొన్నారు.

పదివేల శివలింగాలతో...


శివలింగాలకు పూజలు

రుద్రవరం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం సమీపంలోని గుట్టకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణంలో ఆదివారం పుట్టమట్టి తెచ్చి పదివేల శివలింగాలను తయారు చేశారు. నిర్వాహకులు వీరయ్య, వెంకటేశ్వర్లు, చంద్ర మాట్లాడుతూ లోకకళ్యాణం నిమిత్తం ఇలా చేశామన్నారు. రుద్రవరం, కొండమాయపల్లె, కొత్తూరు, కొత్తపల్లె గ్రామాల నుంచి భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

పేద కుటుంబానికి చేయూత


బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి విష్ణు

కొలిమిగుండ్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్లకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ సంస్థ ఆపదలో ఉన్న ఓ నిరుపేద కుటుంబానికి అండగా నిలిచి, మానవత్వాన్ని చాటుకున్నారు. అనంతపురం జిల్లా బుక్కరాయ సముద్రానికి చెందిన సరస్వతికి గత ఐదేళ్ల క్రితం భర్త మరణించడంతో పూలు కుట్టుకుంటూ తన ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తుంది. రెండు రోజుల క్రితం కుమారుడు రోడ్డు దాటుతూ బస్సు కింద పడి కాలు విరిగింది. కుటుంబ పోషణే భారమైన సరస్వతికి కుమారుడి వైద్య ఖర్చులకు డబ్బులేకపోవడంతో హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు రూ.18వేలు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సభ్యులు విష్ణు, శివప్రసాద్, శివారెడ్డి, సునీల్, శ్రీరామ్, మహేంద్ర పాల్గొన్నారు.

ఆలయ భూములకు వేలంపాట

చాగలమర్రి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెల్లాల క్షేత్రంలో చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర ఆలయాలకు చెందిన 11.29 ఎకరాల భూములకు వేలం పాటలను 6న నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కేవీ రమణ తెలిపారు. వేలం పాటలో పాల్గొనే పాటదారుడు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలని అన్నారు.

మొంథా తెచ్చిన తంటా

తుఫాన్ వల్ల కుళ్లిపోయిన ఉల్లి


చింతలచెరువులో దెబ్బతిన్న ఉల్లిని పొలంలో వదిలేసిన రైతులు

చాగలమర్రి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో రైతన్నలు కుదేలయ్యారు. మండలంలోని ఆవులపల్లె, చింతలచెరువు, కొలుములపేట, చిన్నవంగలి గ్రామాల్లో చేతికొచ్చిన ఉల్లిపంటను కోత కోసి పంట పొలంలోనే ఆరబెట్టారు. తుఫాన్ దెబ్బతో 100 ఎకరాల్లో కోసిన ఉల్లిపంట తడిచిపోయింది. ఆదివారం ఆవులపల్లె గ్రామంలో సుబ్బమ్మ, నాగవేణి, నాగేశ్వరి అనే మహిళా రైతులు దెబ్బతిన్న ఉల్లిపంటను చూపిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. కోత కోసిన కూలీల డబ్బులు కూడా వచ్చే పరిస్థితి లేదని అన్నారు. ప్రభుత్వం స్పందించి పరిహారంఅందజేసి ఆదుకోవాలని మహిళా రైతులు కోరారు.


ఆవులపల్లెలో తుఫాన్‌తో దెబ్బతిన్న ఉల్లిగడ్డలను చూపిస్తున్న మహిళా రైతులు

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్ : మంత్రి బీసీ


చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు వరం సీఎం రిలీఫ్‌పండ్ అని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలంలో బనగానపల్లె నియోజకవర్గంలోని 50 మంది లబ్ధిదారులకు రూ.42 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. మంత్రి బీసీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో సీఎం సహాయనిధి కింద అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదలకు ఈపథకం ఓ వరం లాంటిదన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం పేదప్రజల ఆరోగ్యానికి అండగా నిలుస్తూ కొండంత ధైర్యం ఇస్తూ భరోసా ఇస్తోందన్నారు. చెక్కుల పంపిణీ సందర్భంగా వైద్యసహా యం అందుకున్న రోగుల ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని, వారి యోగ క్షేమాలను మంత్రి స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

శనీశ్వర ఆలయానికి భూమి పూజ


ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే

డోన్ టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): శనీశ్వర ఆలయ నిర్మాణం ఆధ్యాత్మికత్వానికి దోహదపడుతుందని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. ఆదివారం ఉడుములపాడు గ్రామ సమీపంలో చేపడుతున్న ఆలయ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ భూమి పూజ చేశారు. అంతకుముందు ఆలయ పూజారు విహారి స్వామి ముకేష్ స్వామి, నరసింహులు స్వాములు ఆమెకు పూర్ణాహుతితో ఘన స్వాగతం పలికారు. కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా ఇటువంటి ఆలయ నిర్మాణం లేదని, అటువంటిది డోన్ ఈ శనేశ్వర ఆలయాన్ని నిర్మించడంతో ఆధ్యాత్మిక శోభకు దోహదపడుతుందన్నారు. ఆలయ అభివృద్ధికి తమ వంతుగా సహకరిస్తామన్నారు. పూజారులు విహారి స్వామి మాట్లాడుతూ ఆలయంలో వారాహి ఆలయం, కాలభైరవుడు, శివాలయం, ఆంజనేయస్వామి విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మహేష్ కన్నా, ఓంప్రకాష్, ఆర్ఈ నాగరాజు, టీఈ నాగరాజు గౌడు, సీమ సుధాకర్ రెడ్డి, సోంపురం లక్ష్మికాంత రెడ్డి, వేమారెడ్డి, ఉడుములపాడు నాగభూషణంగౌడ్ పాల్గొన్నారు.

సీఎం ముందు చూపుతోనే తుఫాన్ ప్రభావాన్ని అరికట్టారు


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత మూడు రోజుల కిందట వచ్చిన మొంథా తుఫాన్ నష్ట తీవ్రతను సీఎం చంద్రబాబునాయుడు ముందుచూపుతో అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి తుఫాన్ ప్రభావాన్ని అరికట్టేలా చేశారు. టీడీపీ బీసీసెల్ నంద్యాల స్పోర్‌సర్సన్ ముల్లా నాగరాజు తెలిపారు. ఆదివారం చాగలమర్రి టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేశ్, ముందులు, ఎమ్మెల్యేలు, అధికారులు, గ్రామస్థాయి నాయకులను అప్రమత్తం చేసి తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు అండగా ఉండేలా చర్యలు తీసుకోవడం హర్షణీయం అన్నారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ నియోజకవర్గంలో మొక్కజొన్న నష్టపోయిన రైతులకు సాయం అందించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లి రైతులకు భరోసా కల్పించారని అన్నారు ఆళ్లగడ్డ నియోజకవర్గంలో టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి అధికారులు, నాయకులను అప్రమత్తం చేశారు. అన్నారు. నష్టపోయిన రైతులకు పరిహారం అందించి కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుత్తి నరసింహులు, టైలర్‌బాష, బషీర్, బాలదస్తగిరి, పీరయ్య, ఓబులేసు, వెంకటయ్య, కింగ్‌ఉసేన్, మోహన్ తదితరులు ఉన్నారు.

కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదు..?


మాట్లాడుతున్న మాజీ మంత్రి బుగ్గన

డోన్ రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏడాదిన్నర పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన అభివృద్ధి ఏమీ లేదని మాజీ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం సాయంత్రం మండలంలోని మల్లెంపల్లె గ్రామంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మల్లెంపల్లె గ్రామంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తొలి సంతకం చేశారు. అనంతరం గ్రామంలో జరిగిన సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్యం చేరువ చేయాలన్న ఉద్దేశంతో గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్మోహన్ రెడ్డి 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఏర్పాటుకు పూనుకుంటే వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేయాలని చూస్తుందని ఆరోపించారు.

● భక్తుల తొక్కిసలాట దురదృష్టకరం : శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాటలో భక్తులు మృతి చెందడం దురదృష్టకరం, బాధాకరమని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి డోన్ పట్టణంలోని పాతబస్టాండు సమైఖ్యాంధ్ర కట్ట వద్ద కాశీబుగ్గ తొక్కిసలాటలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని క్యాండిల్స్ వెలిగించి మౌ నం పాటించారు. కార్యక్రమాల్లో వైసీపీ నియోజకవర్గ పరిశీలకులు దేశం సుధాకర్ రెడ్డి, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మాజీ రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, పార్టీ జిల్లా వాలంటరీ విభాగపు అధ్యక్షులు పోస్టు ప్రసాద్, పార్టీ పట్టణ, మండల కార్యదర్శులు సోమేష్ యాదవ్ పాల్గొన్నారు.

బేతంచెర్ల: బేతంచెర్ల పట్టణంలోని ఆయా కాలనీల్లో ఆదివారం మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని కోటపేట, చాకలిపేట, తాసిల్ పేటతో పాటు పర్యటించి ప్రజలతో మాట్లాడారు. మండలంలోని గోరుమానుకొండ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ శ్రీనివాసులు అలియాస్ బాబు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలుసుకున్న మాజీ మంత్రి బుగ్గన ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి త్వరగా కోలుకోవాలని అన్నారు. ఆయన వెంట ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, మండల నాయకులు చంద్ర రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధిక రేట్లకు ఇసుక విక్రయిస్తే చర్యలు


మాట్లాడుతున్న శీలం హరికుమార్

ఆళ్లగడ్డ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండలంలో ఇసుకను అధిక రేటకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని టీడీపీ మండల కన్వీనర్ శీలం హరికుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కొందరు ఇసుక వ్యాపారులు జమ్మలమడుగు నుంచి ఆళ్లగడ్డకు ఇసుకను తెచ్చి, టాక్టర్ ఇసుకను రూ 9 వేల నుంచి 10 వేలకు విక్రయిస్తున్నారని అన్నారు. జమ్మలమడుగు,ప్రొద్దుటూరు వ్యాపారులు ఆళ్లగడ్డ కు వచ్చి అధిక ధరలకు ఇసుకను విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుకను అధిక ధరలకు విక్రయిస్తే టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి ఎమ్మెల్యేకు తెలియజేయాలని కోరారు.

'ఐకమత్యంగా మెలగాలి'


మాట్లాడుతున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఐకమత్యంగా మెలిగి ఒకరికొకరు తోడ్పాటు అందించుకోవాలని మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి కోరారు. ఆదివారం బనగానపల్లె పట్టణంలోని మంగళవారం పేట కుర్నిదైవాచార సంఘం ఆహ్వానం మేరకు కార్తీక వనభోజనోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శివాలయంలో ఆయనప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కార్తీక వనభోజన కార్యక్రమంలో పాల్గొని స్వయంగా భోజనం వడ్డించారు. బీసీరాజారెడ్డి మాట్లాడుతూ కార్తీకమాసంలో పూజా కార్యక్ర మాలు, వనభోజన కార్యక్ర మాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నీలకంఠేశ్వరస్వామి దేవాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను విరమించుకోవాలి

● మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్


కోటి సంతకాల సేకరణలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్ టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ విరమించుకోవాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 1వ వార్డు వైఎస్సార్ నగర్‌లో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తలపెట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు.ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో ప్రవేశపెట్టిన ప్రభుత్వ 17 మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జాకీర్ హుశేన్, కౌన్సిలర్లు ఆర్టీ రమన, కురుకుంద హరి, వంశి చలం, పెయింటర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఘనంగా వన భోజనాలు


కార్తీక వనభోజనంలో పాల్గొన్న శాలివాహన సంఘం నాయకులు

బనగానపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని సాయిబాబా ఆలయంలో కుమ్మరి శాలివాహన సంఘం అధ్యక్షుడు సురేశ్ ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనభోజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలచే తులసితోటకు పూజలు, దీపోత్సవ కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్సీలో ఉద్యోగం సంపాదించుకున్న ఉపాధ్యాయులను సత్కరించారు. కలసికట్టుగా వనభోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాగరాజు, శివరాం,నాగభూషణం, జ్యోతీశ్వరుడు, రామసుబ్బయ్య, వెంకటరాముడు, హరి, నాగశేషు, వీరేంద్ర,పెట్టికోట హరి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

4న సర్వసభ్య సమావేశం

కోవెలకుంట్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కోవెలకుంట్లలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఉన్న రైతు సేవా కేంద్రంలో మంగళవారం ఎంపీపీ రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సామవేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వర ప్రసాదరావు తెలిపారు. ఉదయం 10.30గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ, మండల కోఆప్షన్ మెంబరు అన్నిశాఖల అధికారులు హాజరై సమావేశానిక హాజరుకావాలన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి


వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందాంబల కల్యాణం

బనగానపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలోని కాలజ్ఞాన తత్వవేత్తశ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహేంద్రస్వామి 417వ జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ప్రథమపీఠంలోని నేలమఠం, గరిమిరెడ్డి అచ్చమాంబ దేవస్థానం, కాలజ్ఞానం రచించిన రవ్వలకొండలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయంనుంచి ప్రత్యేక పూజలు, ద్వార పూజ, మహాన్యాసకపూర్వక కుంభాభిషేకం, జన్మదిన విశేష పూజలు చేశారు. నేలమఠంలో కన్నులపండువుగా స్వామివారి కళ్యాణోత్సవాలు నిర్వహించారు. జుర్రేరు ఒడ్డున ఉన్న ఆలయ అనువంశిక అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో గోవిందాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవాలు కన్నుల పండువగా నిర్వహించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బేతంచెర్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుమకింది కొట్టాల గ్రామానికి చెందిన జంగటి అనిల్ కుమార్ (29) అనే వ్యక్తి కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడని ఎస్ఐ అబ్దుల్ నబీ తెలిపారు. కనుమకింది కొట్టాల గ్రామానికి చెందిన అనిల్ కుమార్ మద్యానికి బానిసై చెడు వ్యసనాలకు అలవాటు పడ్డాడని తెలిపారు. ఇంటికి సరిగా రావడం లేదని భార్య గంగమ్మతో గొడవపడి మనస్తాపానికి గురై శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఆదివారం మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


కుళాయి రెడ్డి (ఫైల్)

సంజామల,నవంబరు 2,(ఆంధ్రజ్యోతి): అక్కంపల్లె గ్రామంలో వ్యక్తి అదృశ్యమైన ఘటనలో కేసు నమదు చేసినట్లు ఎస్ఐ రమణయ్య ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన గూర్కా కుళాయి రెడ్డి గత నెల 31న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. బంధువులు, స్నేహితులు ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం భార్య శివపార్వతి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గొడవలకు దూరంగా ఉండాలి

ప్యాపిలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గొడవలకు దూరంగా ఉండాలని ఎస్ఐ మధుసూదన్ సూచించారు. ఆదివారం స్థానిక పోలీసు సర్కిల్ కార్యాలయంలో మండలంలోని రౌడీషీటర్లకు ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రశాంతంగా, కలసి మెలసి జీవించాలన్నారు. నాటుసారా, మట్కా,, పేకాట వంటి అసాంఘీక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. పోలీసు నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సత్ప్రవర్తనతో జీవించాలి

బేతంచెర్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సమాజంలో రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో కలిసి జీవించాలని బేతంచెర్ల ఎస్ఐ రమేష్‌బాబు అన్నా రు. ఆదివారం బేతంచెర్ల పట్టనంలోని పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ చేశారు. మాట్లాడుతూ మండలంలోని వివిద గ్రామాల్లో ఉన్న రౌడీషీటర్లు ఎలాంటి ఘర్షణలకు పాల్పడకుండా ప్రజాశాంతికి భంగం కలిగించకుండా ఉండాలన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

కొలిమిగుండ్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఇటీవలి కాలంలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని కొలిమిగుండ్ల సీఐ మద్దినేని రమేష్‌బాబు సూచించారు. ఆదివారం రోడ్డు ప్రమాదాలపై ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అధిక స్పీడు, పరిమితికి మించి లోడుతో వెళ్లరాదని అన్నారు. నిబంధనలు పాటించి, ప్రమాదాలకు దూరంగా ఉండాలని సీఐ రమేష్‌బాబు సూచించారు.